పగ, ప్రతీకారాలకు ప్రతీకలుగా మిగిలిన ఆ జంట ఎవరు?

# నాకూ అదే అనుమానం




నవంబర్ నెల, చలీ చీకటి కలిసిపోయి వికృత నృత్యం చేస్తున్నాయి. చెట్లు భయపడుతూ చూస్తున్నాయి. శవానికి కప్పే తెల్లబట్టలా పొగమంచు అలుముకుంటూ వుంది.


చెట్ల చాటు నుండి నెమ్మదిగా నడుచుకుంటూ నీలాంబరి రోడ్డు మొగలో వున్న పాక హోటలుకు వచ్చింది. అప్పటికే అక్కడ మధురబాబు కూర్చుని ఉన్నాడు.

'ఇతను అప్పుడే వచ్చేసాడే!' అనుకుంది. వారం రోజుల నుంచి జరుగుతున్నదదే!

రాత్రి ఏడు తర్వాత నీలాంబరి పాక హోటలుకు వస్తుంది. సాయంత్రం ఆరయ్యేసరికే ఆ ప్రదేశం నిర్మానుష్యమైపోతుంది. గాలి వూళబెడుతూ ఆ సంగతి ఆ ప్రదేశమంతా మారుమోగేలా చేస్తుంది. చీకటి భూతం, చెట్ల మరుగు నుంచి బయటపడుతుంది నిర్భయంగా. చలి రాక్షసి వళ్ళు విరుచుకొని విజృంభిస్తుంది.

నీలాంబరి దోరగా పండిన దోసపండు రంగులో వుంటుంది. సన్నటి నడుము చుట్టూ మెలి తిరిగిన రంగుల పరికిణీ—నైలాన్ ఓణీ, కాలికి వెండి గజ్జెలు. లిప్‌స్టిక్ లేకపోయినా సిమ్లా ఏపిల్ రంగులో పెదాలు వెన్నముద్దలా, నున్నగా, నిగనిగా మెరుస్తూ బుగ్గలు.

మధురబాబు ఆమెను చూశాడు. ఈ రాత్రి పూట ఈ అమ్మాయికి ఇక్కడేం పని? భయం లేకుండా ఎలా వస్తుందో? అదీ ఎనిమిది రోజుల నుంచి. అహో! ఆపై మాటే! తొమ్మిదో రోజో, పదో రోజో—ఇవాళ. ఏడడుగుల పయనానికే బంధుత్వాలే



ర్పడతాయంటారు. దాదాపు పది రోజుల ముఖ పరిచయం. పలకరిస్తే!

మధురబాబుకు చిలిపి ఆలోచన వచ్చింది. ఈ అమ్మాయిలో మాట కలిపే టైము పాసవుతుంది. ఆఖరు బస్సు వచ్చేవరకూ నిరీక్షణ ఎలాగూ తప్పదు.

నీలాంబరి దగ్గరగా వచ్చింది. పక్క హోటలు ముందున్న బెంచీ మీద ఒదిగి

కూర్చుంది. ఆమె దృష్టి రోడ్డు మీద ఉంది.

ఈ ఆఖరి బస్సు ఎప్పుడు వస్తుందో! అందులో సురేష్ అన్నయ్య రావాలి. ఎందుకు రావడం లేదు. ఇన్నాళ్ళయినా!

మధురబాబును చూసింది నీలాంబరి. తెల్లటి పాంటు, గళ్ళ షర్టు, మెడకి టై, నల్లగా మెరిసే బూట్లు, సన్నటి మీసం, ఉంగరాల జుట్టు, చురుకైన కళ్ళు, యవ్వనం గట్లు తెంచుకొని ప్రవహిస్తుందా అనిపించే బాడీ!

ఇతనెవరో పట్నపు కుర్రాడే! ఇక్కడేం చేస్తున్నాడు? ఈ రాత్రి, చలిలో చీకటిలో బహుశా బస్సు ఎక్కడానికేమో— ఛ—ఛ కాదు— అలా అయితే ఈ పదిరోజులూ? బస్సు కోసమేనా కూర్చుంట?

మధురబాబు లేచి నిలబడ్డాడు. ఆమె ముఖం పరీక్షగా చూశాడు. రెండడుగులు వేసి ఆమె దగ్గరగా నిలబడ్డాడు.

"ఈ ఆఖరి బస్సు ఎప్పుడొస్తుందో! దాంట్లో మానాన్నగారు రావాలి." అన్నాడు. ఆ మాటలు ఆమె నుద్దేశించినవి కావు— అలా అని ఏ స్థంభానికో చెప్పినదీ కాదు. సంభాషణ ప్రారంభం అలా చేస్తేనే బాగుంటుందని అనుకున్నాడు.

"అవును— మా అన్నయ్య కోసం చూస్తున్నాను. ఆయన నగరంలో ప్రొఫెసర్ మెడికల్ కాలేజీ—" నీలాంబరి అంది.

మధురబాబు 'హమ్మయ్య' అనుకున్నాడు. ఈమె 'ఐస్ మెయిడన్' కాదు—

"మెడికల్ కాలేజీ ప్రొఫెసరా? పేరు?" అడిగాడు.

"పెథోలాజీనో ఏదో— సురేష్‌కుమార్ ఆయన పేరు—"

"ఓహో! ప్రొఫెసర్ సురేష్. నాకు ఆయన తెలుసు... ఆయన మీ బ్రదరా?"

"అవును— మీ పేరు— మీకు మా అన్నయ్య ఎలా తెలుసు!—"

"నేను మెడిసిన్ నాలుగో సంవత్సరంలో వున్నాను. ఈ సెమిస్టర్‌లో సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ సబ్జక్టు— పెథోలాజీ మూడో సంవత్సరంలోనే అయిపోయింది— ఆయన ఇప్పుడు ఫోరెన్సిక్ సెక్షన్‌లో వున్నారనుకుంటా—"

"నాకు తెలీదు మీ పేరు?"

"మధురబాబు—"

"మధుర నుంచి వచ్చారా? ఉత్తర ప్రదేశ్ మధురా? తమిళ మధురా?"

మధురబాబు ఆమె మాటలకు తబ్బిబ్బయ్యాడు. ఈ అమ్మాయి సామాన్యమైంది కాదు. మాటలు మొదలుపెట్టి పది నిముషాలు కాలేదు— అప్పుడే పరాచకాలా!

"అవేం కాదు. నేను మధురంగా వుంటాను. అంటే తియ్యగా— అది సరే— మీ పేరు?—"

నీలాంబరి మధురబాబును ఎగాదిగా చూసి అంది. 'నాపేరు మీకెందుకు?—'

"చాలా గడుసువారే! నా పేరు ఇట్టే తెలుసుకున్నారు. మీ పేరు చెప్పరా?"

"పేరు ఒక్కటేనా. ఎలాగూ అంతటితో ఆగరు కదా నా కథే చెబుతాను.... నీలాంబరి గొంతు సవరించుకుని చెప్పడం మొదలు పెట్టింది.

మా ఇంట్లో నేనూ, మా సురేష్

అన్నయ్య ఇద్దరమే. వంద ఎకరాల పై మాటే మా వ్యవసాయ భూమి. పెసలు, కందులు, వేరుశనగ పండుతాయి. మా అన్నయ్యకు పెద్ద బస్సు కంపెనీ వుంది. సెలవు రోజుల్లో ఆ పనులు చూసుకుంటూ వుంటాడు. మెడికల్ కాలేజీలో లెక్చర్లు కాకుండా. నేను ఎకనామిక్స్ బి.ఏ పాసయ్యాను. అక్కడతో చదువు ఆగిపోయింది. ఇక తర్వాత సంగతి తెలిసిందే— పెళ్ళి.

సంబంధాల గురించి వేట మొదలయింది. ఏదీ కుదరలేదు. ఆఖరికి మా వూర్లోనే మంచి సంబంధమున్నదని తెలిసింది. మా అన్నయ్య వాళ్ళతో వెళ్ళి మాట్లాడేడు. ఇచ్చిపుచ్చుకోడాలు అన్నీ ఆరు అంకెలలోనే. అబ్బాయి మరో మూడు రోజుల్లో పెళ్ళి చూపులుకొస్తాడని తెలిసింది.

సరిగ్గా అప్పుడే ఒక అనర్థం జరిగిపోయింది. పెళ్ళి విషయం తెలిసి మా మేనమామ మండిపడుతూ వచ్చాడు. అప్పుడు మాకు తెలియని విషయాలు చాలా తెలిశాయి. మేము చిన్నపిల్లలుగా వున్నప్పుడు నాకు కాబోయే మామగారు మా నాన్నను ఏదో తగాదాలో ఖూనీ చేశాడట. ఆయన ఈ సంబంధం ససేమిరా వుప్పుకోనని అరిచాడు, గోల చేశాడు.

అప్పుడు మా అమ్మ అంది. "ఒరే! అన్నయ్యా! నేనది మర్చిపోతాన్రా— అందుకేగా వెధవరికం వచ్చినా జుట్టు కత్తిరించుకోనిది. ఆ నరిసిగాడి రక్తంతోగానీ ఇది ముడిపడదు. వాడు త్రాచులాంటివాడు. అందుకే దూరంగా వున్నాను. పెళ్ళి పేరుతో సంబంధం కలుపుకుంటాను. ఏ కత్తితో నా భర్తను చంపాడో అదే కత్తితో వాడి తల పుచ్చకాయలా తెగేస్తాను- అంది.

నేను కొరడా దెబ్బ తిన్నదానిలా విగిరిపడ్డాను. సాదాగా కనపడే అమ్మలో ఇంత కసి వుందా? ఆరని అగ్నిజ్వాల! కడుపులో అగ్నిపర్వతం వుంచుకుని ఈమె ఇన్నాళ్ళూ బ్రతికిందా? పెళ్ళి కాగానే నాకు కాబోయే

## ప్రాణ స్నేహం!



రష్యన్ బాలిక జూలియా ప్రోకోసావా ఓ కుక్కని పెంచుతుంది. ఒకరోజు మార్స్ అనే ఆ కుక్క ఓ పిల్లిని చూసి వెంటపడి బైటకి పరుగెత్తి తిరిగి ఇంటికి రాలేదు. అంటే ఆ పాప పాపం దానికోసం ఏడ్చి ఏడ్చి 4 రోజులు స్పృహకోల్పోయింది. పాపం ఆమె తల్లి రేడియో, టి.వి. పేపర్లలో కుక్కకోసం ప్రకటన వేయించింది. ఆఖరికి ఓ పల్లెలో ఆ కుక్క దొరికింది. దాని అరుపు వినపడగానే స్పృహకోల్పోయిన ఆ పాప తక్కున లేచి కూచుందిట!

—అచ్యుతుని రాజ్యశ్రీ

మామను, తన పాత పగకు బలిచేస్తుందా?

నా చదువు సంస్కారం దీనికి అంగీకరించలేదు. ఆ రాత్రి చీకటిలో నర్సయ్య అనబడే కాబోయే మామగారింటికి వెళ్లాను.

గుమ్మంలో ఆగిపోయాను. నర్సయ్య గొంతు బొంగురుగా వినిపించింది.

"ఈ సంబంధం వప్పుకుందాం. పెళ్ళయిన తర్వాత ఆ సురేష్‌గాడిని ఏసేస్తే ఆడి బస్సులు, పొలమూ మనకే. ఆడి బాబును చంపి కొంత కాజేశాం. ఇప్పుడీ సంబంధం వచ్చింది. "బాబూ! నన్ను కాటేయమని నాగుపాము నడిగితే అదూరుకుంటుందా? ఈ సంబంధం చేసుకొని తర్వాత వరసగా అందర్నీ చంపి..."

ఆయన మాట పూర్తి కాలేదు... కిటికీ దగ్గర నక్కి నిలబడ్డ నా దగ్గరగా, యముడూ తలా ఒక ఆకారం!

భయపడి పరుగెత్తాను. పరుగెడుతూ వెనక్కి తిరిగి చూసాను. 'నరసయ్య—'

నరసయ్య చప్పట్లు కొట్టాడు. నలుగురు పాలేళ్ళు వచ్చారు. "అది— పెళ్ళికూతురనుకుంటూ— మన మాటలింది. ఏసెయ్యండి—" అన్న మాటలు శూలాల్లా నా చెవిలో గుచ్చుకున్నాయి.

ప్రాణం కోసం పరుగెత్తాను— పడుతూలేస్తూ— చీకటిలో పిచ్చిగా పరుగెత్తాను

ఆయాసంతో వూపిరాడక ఒక చోట ఆగాను.

'కస్'మని గాలిని కోస్తూ ఒక శబ్దం. వుందులో కారం చల్లినట్టు భగ్గున మండింది. చీకటిలో కనపడలేదు. చేతితో తడిమి చూసుకున్నాను. ఎడమ రొమ్ము క్రింద భాగం నుంచి రక్తం ధారాపాతంగా కారుతూ వుంది. చేతితో నొక్కి పట్టాను. పరుగెత్తుకుంటూ ఇక్కడకు వచ్చాను. అప్పుడు తెలిసింది. బాకు నా రొమ్ము చీల్చిందని.

నీలాంబరి చెప్పడం ఆపింది.

"నీలాంబరి కథ బాగుంది—" వెటకారంగా అన్నాడు మధురబాబు.

దూరంగా పెద్ద శబ్దం చేస్తూ బస్సు ధ్వని. బస్సు లైట్లు ఆ ప్రదేశమంతా కాంతిమయం చేస్తూ వుంది. ఇద్దరూ ఆ కాంతి పడని ప్రదేశానికి తప్పుకున్నారు.

బస్సు బొయి'మని రొదచేస్తూ వెళ్ళిపోయింది.

"ఇవాళ కూడా రాలేదు. అన్నయ్య—" అంది నీలాంబరి.

"నీలాంబరి—" మధురబాబు అన్నాడు

ఏమ్మా! ఈ పది రోజుల నుంచీ అలా రక్తం ప్రవిస్తూనే వుందా?"

"అవును— మా అన్నయ్యకు చూపెడ్దామని ఇక్కడకు వచ్చా. మరే డాక్టరు దగ్గరకు వెళ్ళదలచుకోలేదు—"

"అయ్యో! పాపం— అంత పెద్ద గాయం మరి. ప్రొఫెసర్ లే చూడాలి."

సర్రున జాకెట్ చింపింది నీలాంబరి.

"నీకంత నవ్వులాటగా వుందా? చూడు గాయాన్ని—" అని కుడిచేత్తో ఎడమ రొమ్ముపై గాయం చూపించింది.

ఎర్ర కలువలా, జేగురు రంగులో, రక్తం కారుతూ ఆమె శరీరం. మహా హిమాలయ శిఖరాన్నుంచి మహార్ణవంలో దభీమని పడ్డట్టయింది మధురబాబుకు. అతని ముఖంలో భావాలు మారిపోయాయి.

"సారీ! నీలాంబరీ— నన్ను క్షమించు—"

నిదానం అంది నీలాంబరి— 'మీ నాన్నగారు ఎందుకు రాలేదు?"

"అదే అర్థంకావడంలేదు. మేమిద్దరమూ ఒకే బస్సులో రావలసింది. కాని నాతో ఆయన రాలేదు. నాకు పెళ్ళి సంబంధం చూస్తున్నానని, పిల్లని చూసుకోవడానికి రమ్మని మా పాలేరును పంపారు. మావూర్లో గొడవలు ఎక్కువ. చదువుకుంటున్న నాకంతగా తెలియవు. గొఱ్ఱెలను కోసినట్లు మనుషుల తలలు కోసేవారట ఇదివరకు. ఇప్పుడు నయం. నేను బస్సు దిగి ఇక్కడే వున్నాను ఆయన రావచ్చని—"

"కొయ్యండి ఇంటికెళ్ళకుండా పదిరోజుల నుంచి ఇక్కడేనా—" అంది నీలాంబరి.

మధురబాబు ముఖం లో భయంకరమైన మార్పు. ముఖంలో భీతి కంగారు ఏదో జ్ఞాపకం తెచ్చుకున్నవాడిలా చెప్పడం ప్రారంభించాడు.

"నిజం చెబుతున్నాను. నేను ఇంటికి బయలుదేరాను. ఆ రాత్రి ఊరి పొలిమేరలో ప్రవేశించే సరికి వూరి చివర దీపం మినుకుమినుకుమంటున్న కాంతిలో చూశాను. ఎవరో ముసుగు మనుషులు.

"ఆగరా!" అని గర్జించారు.


"ఎవరు మీరు?" అడిగాను భయంగా.

"ఎవరైతే నీకెందుకు? ఇవాలిటితో నీ పని సరి." అన్నాడు వాళ్ళలో ఒకడు.

నాకేం తెలీదు అన్నాను వెనక్కి పరుగెడుతూ.

"మా దొర చెల్లెల్ని, కుందనపు బొమ్మలాంటి ఆయమ్మని దారుణంగా పొడుస్తాడురా మీ బాబు—" అంటూ నా వెనకే పరుగెత్తారు. నాకు భయం ఎక్కువైంది. వాళ్ళు నలుగురు— నేను ఒక్కడినే!

చీకట్లో గుడ్డిగా పరుగెత్తాను. పట్నంలో పెరిగిన నాకు పొలాల్లో నడవడమే కష్టం.



పరుగు అసలు చేతకాలేదు. ఒక చోట బోర్లాపడ్డాను.

వీపుమీద కొరడాతో కొట్టినట్టు మంట. తేలు విషంలా శరీరమంతా ఆ మంట వ్యాపించింది. పాముకాటు తిన్నవాడిలా భయపడిపోయాను. మళ్ళీ లేచి పరుగెత్తాను. ఇలా బస్సు స్టాండుకొచ్చి పడ్డాను. ఇక్కడకు వచ్చిన తర్వాత ఈ బల్ల మీద కూర్చుని చూసాను. నా వీపులో పిడిబాకు—''

నీలాంబరి నవ్వుతూ అంది.

మధురబాబుగారు! ఇది అన్యాయం. నా కథ విని మేచింగ్ బ్లాక్‌లా మీరు ఒకటి కల్పించారు కదూ!''

''లేదు— నీలాంబరీ! నా అనుమానం — మన పెద్దలనుకున్నది మనిద్దరి పెళ్ళి అవి. నీది కథకాదు— యదార్థం— నువ్వది ముందే నిరూపించావు. నాది కథ కాదు— కావాలంటే నువ్వే చూడు— నా వీపున వున్న పిడిబాకు.''

మధురబాబు వెనక్కు తిరిగాడు. అతని వీపులో భయంకరంగా పిడిబాకు!

నీలాంబరి కెవ్వున అరిచింది— ''నిజమే— మనిద్దరి పెళ్ళే పెద్దల మనస్సులో వుండే (క్రూరపుటాలోచనవల్ల బెడిసిపోయింది. ఓహ్— ఇప్పటికీ మించిపోయింది లేదు— మనం (ట్రీట్‌మెంట్ చేయించుకుందాం— పట్నం వెళ్ళి పెళ్ళి చేసుకుందాం.'' అంది

మధురబాబు ఆనందంగా అన్నాడు— ''అవును—నీలాంబరీ—ఇన్నాళ్ళ తర్వాతైనా మేము ధైర్యం చెయ్యడం వల్ల మన కథ వెలుగులోకి వచ్చింది. అన్నట్టు తెల్లవారుతోంది— మనం బయలుదేరుదామా—''

''తెల్లవారుతుందంటే భయం వేస్తోంది మధూ—''

''నాకూ అంతే నీలా—''

తెలతెల్లవారుతుంది ఎవరో పది మంది గుంపు అటే వస్తున్నారు.

నీలాంబరీ, మధురబాబు చెట్టు చాటుకెళ్ళి గమనించసాగారు.

నీలాంబరి ఆ గుంపులో ముగ్గుర్ని గుర్తుపట్టింది.

నీలాంబరి తల్లి!

నీలాంబరి అన్న (ప్రొఫెసర్ సురేష్!

నీలాంబరి మేనమామ!

గుంపులో మరో ఇద్దర్ని చూసి వులిక్కిపడింది నీలాంబరి.

''మధూ! వాళ్ళే నన్ను గాయపరచింది—''

మధురబాబు నవ్వుతూ అన్నాడు—

''వాళ్ళు మా పాలేళ్ళు— ఆ ముందు నడుస్తున్నాయన మా నాన్న— అరే! నన్ను పొడిచిన వాళ్ళూ ఈ గుంపులో వున్నారు? వింతగా వుందే! అందరూ ఇలా కలిసిపోయారేమిటి? —''.

''వాళ్లకి కనపడకుండా వింటే సరి ఏమనుకుంటున్నారో!'' అంది నీలాంబరి

ఆ గుంపు దగ్గరగా వచ్చింది.

''ఆ పసివాళ్ళ (ప్రాణాలు పణంగా పెడితేగాని నీ పగ చల్లారలేదా అన్నయ్యా'' నీలాంబరి తల్లి మధురబాబు తం(డితో అంది. ''ఇప్పుడే కోర్టులూ—అవి'' అని అర్ధోక్తిగా ఆగిపోయింది.

''వయస్సు పెరిగినా బుద్ధి రాలేదు చెల్లెమ్మా! దురాశ ఇంత చేస్తుందని అనుకో

లేదు—'' మధురబాబు తండ్రి అన్నాడు గాద్గదికంగా.

చెట్ల మీద నుండి వెలుగు ధారగా వస్తూ వుంది.

''మధూ! నేనీ వెలుగు భరించలేకుండా వున్నాను. ఆ చీకట్లో బాగుంటుంది—'' నీలాంబరి అంది దగ్గరగా వున్న శిధిలమైన భవనం చూపిస్తూ—

''నాకూ అలాగే వుంది నీలాంబరీ! కాని నాకు ఒకటే అనుమానం— పసివాళ్ళ ప్రాణాలు పణంగా పెట్టి అయిపోయింది నీ అమ్మ—''

''నాకూ అదే అనుమానం—''

నీలాంబరీ చీకటివైపు కదిలిపోతూ అంది మధురబాబు అనుసరించాడు.

ఇద్దరూ పాడుపడ్డ శిధిల భవనం వైపు గాలిలో తేలుతూ వెళ్ళిపోయారు. ✱

